క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ నాయకురాలికి ఎమ్మెల్యే పరామర్శ



లక్ష్మిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: వైఎస్సార్‌సీపీ 65వ వార్డు మహిళా అధ్యక్షురాలు జుత్తు లక్ష్మిని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శుక్రవారం పరామర్శించారు. కొద్ది రోజులుగా అనారోగ్యం కారణంగా మల్కాపురంలోని సెయింట్ ఆన్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను కలిసి, ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట నాగిశెట్టి శ్రీను, లోకనాథం ఉన్నారు.

గణేశుడి సన్నిధిలో సంకటహర చతుర్థి పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: సంకటహర చతుర్థిని పురస్కరించుకుని భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల ప్రసన్న గిరిపై కొలువైన బాల వినాయక స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. పరిసర ప్రాంతాల భక్తులు పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకుడు చరణ్ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌లో 'ఏబీఎస్'కు ప్రథమ స్థానం



సర్టిఫికెట్ అందుకుంటున్న ఆర్ట్ ఉపాధ్యాయుడు సురేష్

అగనంపూడి: ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ విభాగంలో 85వ వార్డు అగనంపూడి సమీపంలోని ఏబీఎస్ పాఠశాల ప్రథమ బహుమతి గెలుచుకుంది. పిడిలైట్ సంస్థ నిర్వహించిన పోటీల్లో సుమారు 3 వందల పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా ఏబీఎస్ పాఠశాల విద్యార్థుల చిత్రకళా నైపుణ్యానికి ప్రథమ బహుమతి దక్కింది. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు చక్రబర్తి, సాయి అభిషేక్, శివకుమార్, నరేంద్రకుమార్ పాఠశాల ఆర్ట్ ఉపాధ్యాయుడు నాయిన సురేష్‌ను అభినందిస్తూ సర్టిఫికెట్ అందించారు. పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులను యాజమాన్య ప్రతినిధి పి.ఎం.కొండయ్య, డైరెక్టర్ దీపక్, ప్రిన్సిపాల్ పద్మజ అభినందించారు.

భవిత కేంద్రం పిల్లలకు బాక్సుల పంపిణీ

పెదగంట్యాడ: భవిత కేంద్రంలోని చిన్నారులకు మొకర సన్నిబాబు, సుజాత దంపతులు శుక్రవారం టిఫిన్ బాక్సులు, హ్యాండ్ కర్చీఫ్స్, చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. వారు తమ వివాహ వార్షికోత్సవం సందర్భంగా చిన్నారులకు వీటిని అందించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు ఇమంది శ్రీనివాసరావు, కె.రమణాజీ, ఎం.సూర్యనారాయణ, బి.జయభారతి పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవాళి మనుగడ

పెదగంట్యాడ: మొక్కలతోనే మానవాళి మనుగడ అని 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయ్ అన్నారు. వాటి సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించడం చాలా మంచి విషయమన్నారు. జేడీ ఫౌండేషన్ అధినేత జేడీ లక్ష్మీనారాయణ సూచనల మేరకు స్థానిక విశాఖ విమల విద్యాలయంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో మొక్కలు నాటించారు. వాటిని సంరక్షించే బాధ్యతను విద్యార్థులకు అప్పగించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జాస్మిన్, సీజీజీ గ్రూప్ ప్రతినిధి ఐశ్వర్య, పీఎన్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి నవీన్, జేడీ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో అన్ని వార్డుల అభివృద్ధి

- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- రూ.1.21 కోట్లతో అభివృద్ధి పనులకు భూమిపూజ



71వ వార్డులో శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



72వ వార్డులో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: నియోజకవర్గంలో మౌలిక సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేశామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గాజువాకలోని వివిధ వార్డుల్లో రూ.1.21కోట్లతో పలు అభివృద్ధి పనులకు ఆయన శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే కోట్లాది రూపాయల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులను పూర్తి చేశామని తెలిపారు. నియోజకవర్గంలో అన్ని వార్డులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. ఎన్నికల హామీలను కూడా పూర్తిస్థాయిలో నెరవేర్చుతున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

71వ వార్డులో రూ.35 లక్షలతో..

71వ వార్డులో రూ.35 లక్షలతో అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. సుందరయ్య కాలనీ అల్లూరి సీతారామరాజు విగ్రహం వెనుక భాగంలో రూ.15 లక్షలతో సీసీ రోడ్, కాలువల నిర్మాణం, కుంచుమాంబ కాలనీలో రూ.20 లక్షలతో రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాజాన రామారావు, జీవీఎంసీ ఏఈ సౌజన్య, వైఎస్సార్‌సీపీ నాయకులు కటికల కల్పన, జి.నాగేశ్వరరావు, దాముసోతు అప్పారావు, ఆర్టీసీ రాజు, ఆచారి తదితరులు పాల్గొన్నారు.

72వ వార్డులో రూ.86.49 లక్షలతో..

72వ వార్డులోని వివిధ కాలనీల్లో రూ.86.49 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నాగిరెడ్డి భూమిపూజ చేశారు. ఈ వ్యయంతో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్, జెడ్సీ పి.సింహాచలం, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి సిరట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తల్లీపిల్లల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం

గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ



67వ వార్డులో పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న పల్లా శ్రీనివాసరావు, పల్లా చినతల్లి



71వ వార్డులో పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రాజాన రామారావు



74వ వార్డులో గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందిస్తున్న కార్పొరేటర్ వంశీరెడ్డి



65వ వార్డులో టేక్ హోం రేషన్ కిట్ అందిస్తున్న కార్పొరేటర్ నరసింహ పాత్రుడు

గాజువాక: తల్లీబిడ్డల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని కార్పొరేటర్లు తెలిపారు. గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన పౌష్టికాహారం అందిస్తోందన్నారు. బిడ్డలు ఆరోగ్యంగా జన్మించి, ఎదిగేందుకు ఈ పౌష్టికాహారం దోహదం చేస్తుందన్నారు. వైఎస్సార్ సంపూర్ణ ఆరోగ్య పథకంలో భాగంగా నియోజకవర్గ పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్ కిట్లు పంపిణీ చేశారు.

- 71వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు కార్పొరేటర్ రాజాన రామారావు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు కల్పన, నాగేశ్వరరావు, ఆచారి, డి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.
- 72వ వార్డు ప్రశాంతినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్ గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారిణి స్రవంతి, అంగన్‌వాడీ టీచర్ డి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.
- 67వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని కార్పొరేటర్ పల్లా పెంటారావు, డీసీఎంఎస్ మాజీ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పల్లా పెంటారావు, అచ్చింనాయుడు, అంగన్‌వాడీ టీచర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేత

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు దిబ్బపాలెం, దానబోయినపాలెం అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ టేక్ హోమ్ రేషన్ కార్యక్రమం ప్రారంభమైంది. వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు ఎల్.వి.రమణ, యలమంచిలి అప్పారావు ఈ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టి.చంద్రమౌళి, కె.రమణమ్మ, బి.సత్యనారాయణ, శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

74, 65 వార్డుల్లో..

పెదగంట్యాడ: వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంతో గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని 74, 65 వార్డుల కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, బొడ్డు నరసింహపాత్రుడు అన్నారు. సిద్దేశ్వరం, ప్రియదర్శిని కాలనీలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద టేక్ హోం రేషన్ కిట్లను శుక్రవారం వారు పంపిణీ చేశారు. సిద్దేశ్వరం ఎంపీపీ పాఠశాలలో పిల్లలకు వైద్యాధికారి డాక్టర్ మానస వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో మేరీ, వి.వి.ప్రసాదరావు, జి.వెంకటలక్ష్మి, కనకమహాలక్ష్మి, మొదలవలస లోకనాథం, ముగునాయుడు, నాగిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

75వ వార్డు కోరాడలో..

పెద కోరాడ అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ సీపీ నాయకుడు గొందేశి వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద టేక్ హోం రేషన్ కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో గొందేశి అరుణ కుమారి, లక్ష్మి పులి అప్పలరెడ్డి, వెంకటరమణ, సోమునాయుడు పాల్గొన్నారు.

ట్యాంకర్లతో తాగునీటి సరఫరా



ట్యాంకర్ల వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు

పెదగంట్యాడ: ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు చేపట్టారు. ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. జీవీఎంసీ జోన్-6 గాజువాక పరిధిలోని మంచినీటి శుద్ధి కర్మాగారాలకు నీటిని అందిస్తున్న ఏలేరు ఎడమ కాలువకు గండిపడిన నేపథ్యంలో ఈ నెల 3, 4 తేదీల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీనికి ప్రత్యామ్నాయంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా నీటి సరఫరా విభాగం డీఈ మాధవరావు, ఏఈ కేదార్‌నాథ్ చర్యలు చేపట్టారు. గాజువాక నియోజకవర్గ పరిధిలోని 64, 65, 70, 73 (పార్టు), 74, 75, 76 పార్టు, 86, 87, 77, 79, 85, 88వ వార్డులకు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేశారు.

సుప్రీంకోర్టు తీర్పుపై కాంగ్రెస్ నాయకుల సంబరాలు

గాజువాక: పార్లమెంట్ సభ్యత్వంపై అనర్హత వేటు కేసులో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీకి సుప్రీం కోర్టులో ఊరట లభించడంపై ఆ పార్టీ నాయకులు సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా గాజువాకలో కాంగ్రెస్ నాయకులు స్వీట్లు పంపిణీ చేశారు. ఆ పార్టీ గాజువాక నాయకుడు జెర్రిపోతుల ముత్యాలు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రాహుల్‌గాంధీపై రాజకీయ కక్షను ప్రదర్శించిందని, దీనిపై సుప్రీం కోర్టు తీర్పు ప్రజాస్వామ్య విజయమని పేర్కొన్నారు. నాయకులు యరబాల భూలోక, కట్టా అప్పారావు, హరిబాబు, శ్రీను, ఆనంద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల నిరసన



కార్మికులతో మాట్లాడుతున్న జెడ్సీ సింహాచలం

అక్కిరెడ్డిపాలెం: వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ జీవీఎంసీ 68, 69వ వార్డులకు చెందిన పారిశుధ్య కార్మికులు అక్కిరెడ్డిపాలెం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం నిరసన తెలిపారు. ఆ సమయంలో అటువైపు వెళ్తున్న గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం కార్మికుల వద్దకు వెళ్లి విషయం అడిగి తెలుసుకున్నారు. రెండు రోజుల్లో కార్మికులకు జీతాలు వచ్చేలా చేస్తామన్నారని వర్కర్లు తెలిపారు. సిటూ నాయకులు లోకేష్, గొలగాని అప్పారావు, గణేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

32వ రోజుకు గంగవరం పోర్టు కార్మికుల దీక్షలు



దీక్ష శిబిరంలో కూర్చున్న గంగవరం పోర్టు కార్మికులు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న నిర్వాసిత కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పోర్టు వంతెన వద్ద చేపట్టిన నిరవధిక దీక్షలు శుక్రవారం నాటికి 32వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు మాట్లాడుతూ గంగవరం పోర్టు నిర్మాణం కోసం భూములు త్యాగం చేసిన వారికి అన్యాయం చేయడం సరికాదన్నారు. యాజమాన్యం దిగి వచ్చి కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కొవిరి అప్పలరాజు, వాసుపలి ఎల్లాజీ, మాద అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరా పునరుద్ధరణకు వినతి

గాజువాక: గాజువాక ప్రాంతంలో మంచినీటి సరఫరాను వెంటనే పునరుద్ధరించాలని సీపీఎం గాజువాక కార్యదర్శి ఎం.రాంబాబు జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలంను కోరారు. ఈ మేరకు జెడ్సీని కలిసి వినతిపత్రం అందజేశారు. మూడు రోజులుగా పెదగంట్యాడ, స్వతంత్రనగర్, రామచంద్రనగర్, సుందరయ్య కాలనీ, దుర్గానగర్, అరుణోదయ కాలనీ, తోకాడ, శ్రీనగర్, దశమికొండ ప్రాంతాలకు నీటి సరఫరా లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. దీనిపై అధికారులు స్పందించి వెంటనే నీటి సరఫరాను పునరుద్ధరించాలని కోరారు.

విద్యార్థులకు రోటరీ క్లబ్ వితరణ



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్‌లోని రోటరీ క్లబ్, విశాఖపట్నం సౌత్ క్లబ్‌లలో రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 3020 గవర్నర్ రావూరి సుబ్బారావు (దత్తా) శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా చట్టివానిపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కాపీరైటింగ్ పుస్తకాలను పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ ప్రతినిధి ఉమా మహేశ్వరరెడ్డి తమ క్లబ్ చేపడుతున్న కార్యక్రమాలను గవర్నర్‌కు వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ బ్రహ్మానందం, కార్యదర్శి వెంకట గిరి, క్లబ్ మెంబర్లు యార్లగడ్డ వెంకన్న చౌదరి, రమేష్, కిషోర్ కుమార్, చీకటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ పాదుకల సందర్శన



శ్రీరామ పాదుకలను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: అయోధ్య శ్రీరామ పాదుకల భారతదేశ సందర్శన యాత్రలో భాగంగా శ్రీరాముని పాదుకలను 76వ వార్డు హెచ్‌బీ కాలనీ సమీపంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి పంచాయతన ఆలయంలో శుక్రవారం ప్రదర్శించారు. సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకు భక్తుల సందర్శనార్థం వీటిని ఉంచారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పాదుకలను దర్శించుకున్నారు. పెద్దసంఖ్యలో భక్తులు పాదుకలను దర్శించారు. అయోధ్య భాగ్యనగర శ్రీ సీతారామ సేవా ఫౌండేషన్ ప్రతినిధి చల్లా శ్రీనివాస్ శాస్త్రి పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 73వ వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, నాయకుడు కులుకూరి మంగరాజు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమను కాపాడుకుంటాం



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు నినాదంతో, ఉద్యమాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేట్‌పరం కాకుండా కాపాడుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 904వ రోజు శుక్రవారం సీవో, సీసీపీ విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కును గురించి ప్రజలందరూ నిలదీసే సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, నీరుకొండ రామచంద్రరావు, కొమ్ము ప్రసాదరావు, కారు రమణ, ఆదినారాయణ, కనకరాజు, జ్యోతిప్రసాద్, శివరామకృష్ణ, ఎమ్.శ్రీనివాస్, ఆనంద్‌కుమార్, దేముడు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

'అమృత భారత్'కు దువ్వాడ రైల్వేస్టేషన్ ముస్తాబు



దువ్వాడ రైల్వేస్టేషన్ వద్ద శిథిలమైన రహదారిని పునర్నిర్మాణం చేస్తున్న సిబ్బంది

అగనంపూడి(గాజువాక): అమృత భారత్ కార్యక్రమంలో భాగంగా దువ్వాడ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులకు ఆదివారం భూమి పూజ చేయనున్నారు. ఈ సందర్భంగా రైల్వేస్టేషన్ నాలుగో నంబర్ ప్లాట్‌ఫామ్ ఆరు బయట వేదిక ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. వర్చువల్ పద్ధతిలో ప్రధానమంత్రి మోదీ శంకుస్థాపన చేయనున్నారు. ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు పాల్గొననున్న నేపథ్యంలో భారీ ఎత్తున బహిరంగ సభ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. సుమారు ఐదు వేల మందికి సరిపడా వేదికను ఏర్పాటు చేశారు. కార్ల పార్కింగ్ కోసం కేటాయించిన స్థలాన్ని శుభ్రం చేశారు. ముఖ ద్వారానికి ముందు ఉన్న రహదారిని పునర్నిర్మిస్తున్నారు. రెండు రోజుల నుంచి ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ సిబ్బంది పహరా కాస్తూ వచ్చిపోయే ప్రయాణికులను తనిఖీలు చేస్తున్నారు.

కళలను ప్రోత్సహించడంలో విస్కా కృషి భేష్



సాంస్కృతిక విజయోత్సవాలను ప్రారంభిస్తున్న స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ బాగ్చీ

ఉక్కునగరం: సాహిత్యం, నృత్యం తదితర కళలను, కళాకారులను ప్రోత్సహించడంలో విశాఖ స్టీల్ కల్చరల్ అసోసియేషన్ (విస్కా) కృషి ప్రశంసనీయమని స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) అరుణ్ కాంతి బాగ్చీ అన్నారు. విస్కా ఆవిర్భవించి 40 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక ఆంధ్రకేసరి కళాక్షేత్రంలో నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న సాంస్కృతిక విజయోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బాగ్చీ మాట్లాడుతూ నలభై ఏళ్ల పాటు అనేక కార్యక్రమాల ద్వారా కళాభిమానులను అలరించిన విస్కా భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు. విస్కా అధ్యక్ష, కార్యదర్శులు నేమాని శ్రీనివాసశర్మ, ఎ.కేశవరావు మాట్లాడుతూ అందరి సహకారంతో భవిష్యత్తులో మరిన్ని వైవిధ్యమైన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో భాగంగా నాట్యోపాసన పురస్కార గ్రహీత డాక్టర్ లావణ్య శిష్యబృందం ప్రదర్శించిన భరతనాట్యం ఆహూతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఉక్కు విశ్రాంత డైరెక్టర్ ఎస్.ఎస్. రావు, లాస్య నృత్యాలయ స్థాపకురాలు డాక్టర్ లావణ్య, డి.ఆదినారాయణ, కళాక్షేత్రం కార్యదర్శి సత్యనారాయణ, విస్కా కార్యవర్గ సభ్యులు జి.ఎస్.ఆర్. కిషోర్, డి.దుర్గాప్రసాద్, ఈరంకి శ్రీనివాస్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏటికొప్పాక వెళ్లి పింఛన్ అందజేత



మజ్జి వెంకయ్యమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ రాము

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు ఫకీర్‌తక్యా ఎస్సీ కాలనీ-1 సచివాలయానికి చెందిన వలంటీర్ రాము అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం ఏటికొప్పాక గ్రామానికి వెళ్లి లబ్ధిదారుకు పింఛన్ అందజేశారు. వివరాలివి.. 86వ వార్డుకు చెందిన మజ్జి వెంకయ్యమ్మ (86) వృద్ధాప్య పింఛన్ లబ్ధిదారు. ఇటీవల ఆమె ఆరోగ్యం క్షీణించడంతో, స్థానికంగా ఆమెను చూసుకునేవారు ఎవరూ లేకపోవడంతో ఆమె మనవడు ఏటికొప్పాక గ్రామానికి తీసుకువెళ్లి, అక్కడే చికిత్స చేయిస్తున్నాడు. విషయం తెలిసిన వలంటీర్ రాము ఏటికొప్పాక వెళ్లి వెంకయ్యమ్మకు పింఛన్ అందజేశాడు. ఆమె వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఎర్ర బ్యాడ్జీలతో ఆర్టీసీ కార్మికులు విధులకు హాజరు



స్టీల్ సిటీ డిపో వద్ద దీక్షలో పాల్గొన్న కార్మికులు

ఉక్కునగరం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ కూర్మన్నపాలెం స్టీల్‌సిటీ డిపోలో కార్మికులు శుక్రవారం ఎర్ర బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. ఎస్‌ఎంయూ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 22వ రోజుకు చేరుకున్నాయి. డిపో ఆవరణలోని యూనియన్ కార్యాలయంలో జరుగుతున్న దీక్షను డిపో కార్యదర్శి జి. సాయిరామ్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ అన్ని సెక్షన్ల దగ్గర మంచినీటి సదుపాయం కల్పించాలని, 24 మంది కార్మికులకు రావాల్సిన మే నెల జీతం చెల్లించాలని, చట్ట వ్యతిరేకంగా తిరుగుతున్న స్టీల్‌ప్లాంట్ ఓఎంఎస్ సర్వీసులను సరి చేయాలని డిమాండ్ చేశారు. కె.వి.ఆర్.కె.గుప్త, టి.దేముడు, పి.సత్యారావు, ఎం.అప్పారావు దీక్షలో కూర్చున్నారు. కార్యక్రమంలో జి.ఎస్.రావు, డి.ఎస్.వాసులు, ఎం.ఎ.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం

- ఫ్రైడే – డ్రైడే కార్యక్రమంలో సీఎంవో సురేష్‌కుమార్



మిందిలోని బావుల్లో గంబూసియా చేపపిల్లలను వదులుతున్న జీవీఎంసీ అధికారులు

అక్కిరెడ్డిపాలెం: పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరమవుతాయని జీవీఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ సురేష్‌కుమార్ అన్నారు. ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించడం ద్వారా దోమల వ్యాప్తికి చెక్ చెప్పవచ్చన్నారు. జీవీఎంసీ 68వ వార్డు మిందిలో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇళ్లల్లో, పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. అనంతరం స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తడి, పొడి చెత్తపై స్థానికులకు అవగాహన కల్పించారు. దోమల నివారణకు పలు నివాసాల్లోని బావుల్లో గంబూసియా చేపపిల్లలను వదిలారు. మలేరియా, డెంగ్యూ జ్వరాలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ఫ్రై డే – డ్రై డే ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం, బయాలజిస్ట్ సాంబమూర్తి, ఏఎంహెచ్‌వో కిరణ్ కుమార్, శానిటరీ సూపర్‌వైజర్ రామారావు, మలేరియా ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్లు కె.అప్పలరాజు, ఎస్.వెంకటేష్, ఆర్.విష్ణుకుమార్, సచివాలయ హెల్త్ సెక్రటరీలు, యూసీడీ సిబ్బంది, సీవోలు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ లబ్ధి



మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెదగంట్యాడ: అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే చెందుతుందని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 77వ వార్డు మరడదాసరిపేట తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. కార్పొరేటర్ బట్టు సూర్యకుమారితో కలిసి ఇంటింటికీ వెళ్లి, లబ్ధిదారులతో మాట్లాడారు. అన్ని పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలను తెలుసుకుని, పరిష్కరించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో వార్డు నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.